ఈనాడు
మహబూబాబాద్
గురువారం అక్టోబరు 17, 2024

పత్తి అమ్మకాల్లో సందేహాలా.. నివృత్తి చేసుకోండి

నేడు జేడీఎం శ్రీనివాస్‌తో ఈనాడు ఫోన్ ఇన్



పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 4,10,632 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తిలో తేమశాతం ఆధారంగా సీసీఐ ధర నిర్ణయిస్తుంది. ఈ సమయంలో గిట్టుబాటు ధర రావడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. అకాల వర్షాలతో రంగు మారిన పత్తి అమ్మకం ఎలా?.. సీసీఐ నిబంధనలు ఏమిటి? తదితర సందేహాలు రైతులను వేధిస్తున్నాయి. కింది నెంబర్లకు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చు. మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ సమాధానాలు ఇస్తారు.

-(న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్)

సంప్రదించాల్సిన చరవాణి నెంబరు
73307 33669, 8985131057
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

నేడు జిల్లాస్థాయి కళాఉత్సవ్

మానుకోట, న్యూస్‌టుడే: కళాఉత్సవ్-2024 జిల్లా స్థాయి పోటీలు గురువారం జిల్లా కేంద్రంలోని ఎంపీపీఎస్ బాలికల పాఠశాలలో నిర్వహిస్తారు. పోటీల్లో 9,10, 11, 12 (ఇంటర్) చదువుతున్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కళాశాలల విద్యార్థులు పాల్గొననున్నారని జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్, ఏఎంఓ అజాద్ చంద్రశేఖర్ తెలిపారు. గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటిక, వీజువల్ ఆర్ట్స్, కథలు చెప్పడం అంశాల్లో ఈ పోటీలను నిర్వహిస్తారు.

క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు సీఎం కప్



కలెక్టరేట్‌కు చేరుకున్న సీఎం కప్ టార్చ్ ర్యాలీని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్‌తో కలిసి ప్రారంభిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో నైపుణ్యాలను పెంచేందుకు సీఎం కప్ కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 టార్చ్ ర్యాలీ బుధవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా నుంచి మహబూబాబాద్‌కు చేరుకుంది. జిల్లా కేంద్రంలో ఆ ర్యాలీకి స్వాగతం పలికిన ఎమ్మెల్యే మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ పట్టణంలో ప్రదర్శన నిర్వహించి నెల్లికుదురు, తొర్రూరు మీదుగా జనగామ జిల్లాకు పంపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందన్నారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, ఏఎస్పీ చెన్నయ్య, క్రీడలు, యువజనుల శాఖ జిల్లా అధికారి అనిల్, సీఎం కప్ నోడల్ అధికారి కల్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత

నెల్లికుదురు: క్రీడలతో ఉజ్వల భవిత ఉంటుందని జిల్లా క్రీడల యువజన అధికారి అనిల్‌కుమార్, తహసీల్దారు రాజు, ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. క్రీడా టార్చ్ యాత్ర బుధవారం నెల్లికుదురుకు చేరుకోగా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, నేతలు స్వాగతం పలికారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ, జోనల్ కార్యదర్శి శంకర్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.బలయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, విజయ్‌చంద్, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అనిల్‌కుమార్, నెల్లికుదురు, ఇనుగుర్తి, కేసముద్రం మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు, నేతలు ప్రభాకర్, యాకయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, హస్సంత, రవి, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: నవంబర్‌లో జరిగే సీఎం కప్ టోర్నమెంట్ టార్చ్ బుధవారం తొర్రూరుకు చేరుకుంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ర్యాలీగా తిరుగుతున్న సందర్భంగా తొర్రూరుకు చేరుకున్న టార్చ్‌కు డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో మున్సిపల్ ఛైర్మన్ రామచంద్రయ్య, ఉపఛైర్మన్ సురేందర్‌రెడ్డి, శాట్ అధ్యక్షుడు కృష్ణారెడ్డిలు ఘనస్వాగతం పలికారు.

డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు అవకాశం

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు రాత, ప్రయోగ, సెమినార్ తదితర పరీక్షలు 2024-25 విద్యా సంవత్సరం కాలపరిమితికి సంబంధించి క్లియర్ చేయడానికి అవకాశం కల్పించారు. ఈమేరకు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వీటికి సంబంధించిన పరీక్షా రుసుం వివరాలు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

బడి.. నూతన ఒరవడి..!

ఏళ్ల తరబడి ఉపాధ్యాయు కొలువు కోసం కన్న కలలను వారు నిరంతర అధ్యయనంతో సాకారం చేసుకున్నారు.. డీఎస్సీ-2024 నియామక ప్రక్రియ రెండు నెలల్లోనే పూర్తైంది. ఎంపికైన వారికి పాఠశాలల కేటాయింపు కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించి జిల్లాలో 363 మందికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. బుధవారం వారంతా మండల విద్యాశాఖాధికారుల నుంచి జాయినింగ్ ఉత్తర్వులను తీసుకుని తమకు కేటాయించిన పాఠశాలల్లో ఉత్సాహంగా అడుగిడారు. వీరిలో ఇప్పటికే వేరే ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా ఉన్నారు.

–మానుకోట, న్యూస్‌టుడే



విభాగం	సంఖ్య
ఎల్పీ హిందీ	05
ఎల్పీ తెలుగు	14
పీఈటీ	02
ఎస్ఏ జీవశాస్త్రం	17
ఎస్ఏ ఆంగ్లం	07
ఎస్ఏ హిందీ	03
ఎస్ఏ గణితం	10
ఎస్ఏ పీడీ	02
ఎస్ఏ భౌతికశాస్త్రం	03
ఎస్ఏ సాంఘిక శాస్త్రం	21
ఎస్ఏ తెలుగు	06
ఎస్జీటీ	259
ఎస్జీటీ ప్రత్యేక విద్య	14

మౌలిక సదుపాయాల కల్పన మరచిపోవద్దు

జిల్లాలో నూతన ఉపాధ్యాయ నియామకాలతో బోధనా సిబ్బంది కొరత చాలా వరకు తీరినప్పటికీ పలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత సమస్య అలాగే ఉంది. మన ఊరు-మన బస్తీ-మన బడి పథకాల కింద రెండేళ్లుగా చేపట్టిన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, నిర్మాణ పనులు ముందుకు సాగక పడకేశాయి. వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సౌకర్యాల కల్పన పనులపై మరింతగా దృష్టిని పెట్టాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో 676 ప్రాథమిక, 120 ప్రాథమికోన్నత, 102 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. వీటిల్లో ఇప్పటివరకు 3,014 మంది వివిధ విభాగాలకు చెందిన ఉపాధ్యాయులుండగా ఇప్పుడు వారికి తోడుగా 363 మంది కొత్తగా విధుల్లో చేరారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోధనా సిబ్బంది కొరత గణనీయంగా తగ్గింది. మారుమూల గ్రామాలు, తండాల్లోని ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లే అవకాశం కలిగింది. అంతేకాదు.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఉపాధ్యాయులు సరిపోను లేరనే కారణంతో చాలా గ్రామాల్లో ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో విద్యార్థుల నమోదు తగ్గిపోతోంది. ఇప్పుడు ఆ సమస్య ఉండకపోవచ్చనే అభిప్రాయాన్ని పలువురు సీనియర్ ఉపాధ్యాయులు 'న్యూస్‌టుడే'తో వెలిబుచ్చారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల కొరత తీరనుంది. రెండు నెలల కిందటే ఉపాధ్యాయుల కొరతను దృష్టిలో పెట్టుకుని పని సర్దుబాటు ప్రక్రియపై జిల్లా విద్యాశాఖ కసరత్తు చేసింది. డీఎస్సీ-2024 నియామకంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ జరగడంతో పని సర్దుబాటు అంతగా అవసరం ఉంటుందా అనేది చర్చనీయాంశంగా మారింది.

కొత్త ఉపాధ్యాయుల చేరికతో బోధన కష్టాలు దూరం



జిల్లా కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో బుధవారం చేరిన నలుగురు మహిళా ఉపాధ్యాయులు

ఐదు తరగతులకు ఒకే గది..!



తిరుమలాపురం ప్రాథమిక పాఠశాల

కురవి మండలం తిరుమలాపురం ప్రాథమిక పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. బోధనకు ఇబ్బందిగా ఉండేది. తాజాగా జరిగిన నియామకంలో ఈ పాఠశాలకు ఉపాధ్యాయురాలు బుధవారం విధుల్లో చేరారు. ఉపాధ్యాయుల కొరత తీరింది. ఈ బడికి ఒకే గది ఉండడం వల్ల ఒకటి నుంచి ఐదు తరగతుల వారికి ఇక్కడే బోధించాల్సిన పరిస్థితి. అంతేగాక ఈ గది పైకప్పు కూడా వర్షం వస్తే కురుస్తుంది. నూతన గదులను నిర్మించాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, కురవి

సొంత ఊరిలో పని చేసే అదృష్టం

- కె.అశ్విని, ఎస్జీటీ, యూపీఎస్, వేంనూరు



మా సొంత ఊరు మహబూబాబాద్ మండలంలోని వేంనూరు. ఇప్పుడు అక్కడి పాఠశాలలోనే ఉపాధ్యాయురాలిగా పనిచేసే అవకాశం వచ్చింది. దీన్ని అదృష్టంగా భావిస్తాను. కేవలం చదువు చెప్పడమే కాకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తాను.

పిల్లల నమోదును పెంచుతాను

- ఎండీ రిజ్వానా, ఎంపీపీఎస్, అమనగల్



నేను పదో తరగతి, ఇంటర్ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివాను. గ్రామంలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తాను. బోధనా కృత్యాల ఆధారంగా విద్యార్థులకు సులువుగా అర్థం అయ్యేలా బోధిస్తాను. మా నాన్న ఉపాధ్యాయుడే.. వారిని ఆదర్శంగా తీసుకుంటాను.

ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

- రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లాలోని పాఠశాలల్లో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు నా శుభాకాంక్షలు. ఈ వృత్తిలో గుర్తింపు పొందేలా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నాను. జిల్లాలో ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరత సమస్య తీరింది.

కొలువుల్లో కొత్త ఉపాధ్యాయులు..



వేంనూరు పాఠశాలలో

మానుకోట, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ద్వారా జిల్లాలో నియమితులైన వివిధ విభాగాలకు చెందిన 363 మంది ఉపాధ్యాయులకు మంగళవారం రాత్రి వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పాఠశాలల కేటాయింపు ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్ ఇచ్చారు. వీరంతా బుధవారం తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరేందుకు తొలుత మండల వనరుల కేంద్రాలకు వెళ్లి ఎంఈఓల నుంచి జాయినింగ్ ఉత్తర్వులను తీసుకున్నారు. ఆ తర్వాత పాఠశాలల్లో చేరారు. దీంతో మండల వనరుల కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులను అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వాగతించారు.

ఆధ్యాత్మిక చింతనతో గ్యార్వీ షరీఫ్



డోర్నకల్‌లో భారీ జెండా వద్ద భక్తులు

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లో ముస్లింలు గ్యార్వీ షరీఫ్‌ని ఆధ్యాత్మిక చింతనతో నిర్వహించారు. న్యూనైప్రూ వీధిలో దివంగత హకీం సాబ్ ఆవాసంలో జరిగిన గ్యార్వీ షరీఫ్‌కి ఉస్మానియా-ఏ-మసీదు పేషీమాం ఎండీ సుల్తాన్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణ వీధుల్లో భారీ జెండాను ఊరేగించారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకం



నర్సింహులపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 92 కేజీల ఫ్రీ స్టైల్ విభాగంలోని రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో నర్సింహులపేటకు చెందిన గంగాధరి సాయివర్ధన్ బంగారు పతకం సాధించినట్లు హనుమకొండ డీవైఎస్ఓ, ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 సెక్రటరీ గుగులోతు అశోక్‌కుమార్, డీఐఈఓ గోపాల్‌నాయక్ బుధవారం తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మైనార్టీ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న సాయివర్ధన్ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెలలో ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు డీఎస్ఏ హనుమకొండ కోచ్ కందికొండ రాజు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో లోపాలు



ఈనాడు కథనాన్ని చూపిస్తూ మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్

డోర్నకల్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో న్యాయం జరగడం లేదని మంత్రులే పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కే పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ధ్వజమెత్తారు. బుధవారం డోర్నకల్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో లోపాలను వేలెత్తి చూపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంట్లో దొంగలు పడిన సంఘటన ప్రస్తావిస్తూ మిమ్మల్ని మీరు కాపాడుకోలేరు.. ప్రజలను పట్టించుకోరు ఎటూ పోతుంది మీ పాలన అని ప్రశ్నించారు. అధికారం చేపట్టి పది నెలలు గడిచినా హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు పొరపాటున ఓటు వేశామని ప్రజలు మదన పడుతున్నట్లు చెప్పారు. భారాస పాలనలో షీ టీం ఏర్పాటుతో స్త్రీలకు భరోసా ఉండేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఇతర విభాగాల ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనా జీతాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో మంత్రులు లేని శాఖలు చాలా ఉన్నాయని వాటిపై ముఖ్యమంత్రికి సమీక్ష జరపాలనే ఆలోచన రాకపోవడం దారుణమని సత్యవతి రాథోడ్ దుయ్యబట్టారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విద్యాసాగర్, సింగిల్ విండో ఛైర్మన్ బిక్షంరెడ్డి, నాయకులు మన్యుపాట్నీ, యశోధర్‌జైన్, కొత్త వీరన్న, మధు, రామభద్రం, ఎండీ గౌస్ ఉన్నారు

గురుకుల విద్యార్థులకు భరోసా కల్పించాలి

రాష్ట్రంలో ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ గురుకులాలకు అద్దె బకాయిలు చెల్లించి విద్యార్థులకు భరోసా కల్పించాలని సత్యవతిరాథోడ్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. డోర్నకల్‌లో ఆమె 'అద్దె రాలేదు..ఇదేం బాలేదు!' శీర్షికతో 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనాన్ని చూపిస్తూ అద్దె చెల్లించడం లేదని తాళం వేస్తే విద్యార్థులు ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో 273 గురుకులాలు ఉంటే కేసీఆర్ వాటి సంఖ్యను 1028కి పెంచారని చెప్పారు. ఇప్పటికైనా మెస్ ఛార్జీల పెంపు, విద్యార్థుల ఫీజు బకాయిలు, డైట్ ఛార్జీలు, అద్దెల విడుదలపై దృష్టి సారించాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం మండలం పెనుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రసాయనశాస్త్ర ఉపాధ్యాయలు గురునాథరావు రూపొందించిన ప్రాజెక్టు ప్రతిపాదన జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త దిల్లీలోని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) బోధనలో వినూత్న ఆవిష్కరణలపై జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి కేసముద్రం మండలం పెనుగొండ ప్రభుత్వ పాఠశాల నుంచి 'ప్రయోగాత్మక స్టెమ్ విద్య ద్వారా విద్యార్థుల అభ్యసనాన్ని శక్తివంతం చేయడం' ప్రాజెక్టు ప్రతిపాదన ఎంపికైనట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేసి మార్చి నెల కొత్త దిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి సదస్సులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

మానవీయ విలువలకు పునరుజ్జీవం పోసేలా రచనలు



మహబూబాబాద్, న్యూస్‌టుడే: సమాజంలో కనుమరుగవుతున్న మానవీయ విలువలకు పునరుజ్జీవం పోసేలా కవులు, రచయితలు తమ నూతన రచనలను ఆవిష్కరించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ ఆకాంక్షించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బానాల వీరయ్యాచారి(వీరన్న) రచించిన 'శ్రీ వీరభద్రస్వామి నీతి చంద్రిక' పుస్తకాన్ని బుధవారం స్థానిక పద్మశాలి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఉమ్మగాని అరుణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ సమాజాన్ని అధ్యయనం చేసిన రచయిత వీరయ్యాచారి సమాజం కోసం పడుతున్న తపన ఏమిటో ఆయన రచనల్లో కనిపిస్తుందన్నారు. పుస్తక రచయిత వీరయ్యాచారి మాట్లాడుతూ కవులు, రచయితలు తమ రచనలు దాచుకుంటే అవి మరుగున పడిపోతాయని వాటిని ప్రజల్లోకి తీసుకెళితే వారిలో చైతన్యం వస్తుందన్నారు. అంతర్జాతీయ ప్రకృతి వైద్య గ్రంథాలయం, పరిశోధనా కేంద్రం వ్యవస్థాపకులు ఆచార్య గజ్జెల రామేశ్వరం, పుస్తక సమీక్షకులు చొప్పరి శ్రీనివాస్, సామాజికవేత్తలు, రచయితలు మైస శ్రీనివాసులు, మైస నాగయ్య, ఎర్రోజు లక్ష్మణాచార్యులు, గుర్రపు సత్యనారాయణ, బొడ్ల నారాయణరావు, శంతన్ రామరాజు, చల్లమల్ల నారాయణ, అనుమాండ్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ధర్నా'

కురవి, న్యూస్‌టుడే: వరి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గుండ్రాతిమడుగు(వి)లో సహకార సంఘం కార్యాలయం ఎదుట రైతులు గురువారం ధర్నా చేశారు. సహకార సంఘంలో గుండ్రాతిమడుగుకు చెందిన రైతులు కుంభం మైసయ్య, లచ్చయ్య, సూరయ్య, లాలు, నారాయణపురం గ్రామానికి చెందిన దీప్లాతో పాటు కొంత మంది రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు. 1001 దొడ్డు రకం విత్తనాలకు బదులుగా జేజే రకం విత్తనాలు ఇచ్చారు. 125 రోజులకు రావాల్సిన పంట 70 రోజులకే వచ్చి పంట దిగుబడి తగ్గి పోవడంతో తీవ్రంగా నష్ట పోయినట్లు రైతులు వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.. ఈ విషయమై సహకారం సంఘం కార్యదర్శి వెంకన్నను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తెలంగాణ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి వచ్చిన విత్తనాలనే రైతులను ఇచ్చామన్నారు. ఈ విషయాన్ని సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.


జాతీయ రహదారి డిజైన్ మార్చాలని ఆందోళన



మహబూబాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఆందోళన చేస్తున్న రైతులు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ వలిగొండ నుంచి భద్రాచలం ఎన్‌హెచ్ 930 పి జాతీయ రహదారి నిర్మాణం డిజైన్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయని మొదటగా ప్రతిపాదించిన ఆకృతి ప్రకారం రహదారి నిర్మించాలని కోరుతూ బుధవారం మహబూబాబాద్ పురపాలక సంఘం పరిధిలోని రజాలిపేట, సాలార్ తండాకు చెందిన రైతులు ఆర్డీవో కార్యాలయంలో ఆందోళన చేశారు. కొందరు నాయకులు తమ స్వప్రయోజనాల కోసం ఎన్‌హెచ్ డిజైన్ చేశారని నేరుగా వెళ్లాల్సిన రహదారిని వారికి ఇష్టమైన చోట మలుపులు తిప్పుతూ రూపొందించారని రైతులు ఆర్డీవో అలివేలుతో వాగ్వాదానికి దిగారు. పలువురు మందు డబ్బాలు తమ వెంట తీసుకెళ్లి రహదారి డిజైన్ మార్చకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆర్డీవో ఎదుట నిరసన తెలిపారు. సమీపంలోని రైతుల నుంచి కంబాలచెరువు మీదుగా వెళుతున్న ఇందుకు స్పందించిన ఆర్డీవో ఈ అంశం తన పరిధిలో లేదని స్పష్టం చేయడంతో రైతులు వెనక్కి తగ్గకుండా ఆర్డీవోను తీసుకొని వెళ్లి కలెక్టర్‌ను కలిశారు. తాను క్షేత్ర సందర్శన చేస్తానని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఇదేందయ్యా ఇది..



జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రం శివారులోని విద్యుత్తు సబ్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రధాన విద్యుత్తు లైన్లకు పిచ్చి తీగలు అల్లుకున్నాయి. ఏకంగా 10 అడుగుల మేర చుట్టుకోవడంతో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ, తెగిపోయేలా ఉన్నాయి. వాటిని తొలగించి, ముందస్తు ప్రమాదాన్ని నివారించాలని స్థానిక రైతులు, ఆయా మార్గంలో వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ రణధీర్‌ను వివరణ కోరగా.. తొలగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పాలకుర్తి

నలుపు వరి.. ఆరోగ్య సిరి



చుట్టూ పచ్చని పొలాలు.. మధ్యలో నల్లగా ఉన్న పంటను చూస్తే తెగులు సోకిందని అనుకుంటే పొరపాటే. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లిలో 15 గుంటల విస్తీర్ణంలో మహిళా రైతు కొప్పుల కోమల బ్లాక్ రైస్ సాగు చేశారు. తన కుమారుడు బెంగళూరులో ఆయుర్వేద డాక్టర్‌గా శిక్షణ పొందుతున్న క్రమంలో అక్కడి నుంచి తెచ్చిన వరి వంగడాన్ని తెచ్చి సాగు చేసినట్లు వివరించారు. ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు ఉండటంతో పాటు సాగు సులువుగా చేయవచ్చని.. అందుకే బ్లాక్ రైస్ పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకులు రావుల ఉమారెడ్డి తెలిపారు.

– ఈనాడు, హనుమకొండ-న్యూస్‌టుడే, మొగుళ్లపల్లి

ప్రాణాలతో చెలగాటమా?



అసలే జాతీయ రహదారి... వాహనాలు వాయువేగంతో దూసుకెళ్తాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనంపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ ఇలా కనిపించారు. ముందూ వెనక ఎటువంటి ఆసరా లేకుండా ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పడితే అంతేసంగతులు..

– ఈనాడు,హనుమకొండ

శిక్షణ పొందుతూ.. ప్రత్యక్షంగా వీక్షిస్తూ..



రామప్ప ఆలయంలో వాలంటీర్ల బృందం

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ రెండో రోజు కొనసాగింది. బుధవారం ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. అనంతరం కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు వాలంటీర్లకు శిక్షణ తరగతులను తీసుకున్నారు. రామప్పకు యునెస్కో గుర్తింపు ఎలా వచ్చింది? ఆలయ నిర్మాణ శైలి ఎంటీ? కాకతీయులు వాడిన సాంకేతిక పరిజ్ఞానం ఎంటీ? ప్రపంచ స్థాయిలో ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఇంకెక్కడైనా ఉందా? గుర్తింపునకు ఎలాంటి కారణాలు దోహదపడ్డాయనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మధ్యాహ్నం ప్రొఫెసర్ దేవాప్రతాప్ ఆలయ నిర్మాణంలో వాడిన సామగ్రి, వాటి సేకరణ, ప్రత్యేకంగా ఆ సామగ్రినే ఉపయోగించడానికి గల కారణాలు, వాటికిచ్చిన ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల అనంతరం రామప్ప ఆలయానికి చేరుకుని శిక్షణలో తెలుసుకున్న విషయాలను స్వయంగా ఆలయంలో వీక్షించి వాలంటీర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, సాండ్‌బాక్స్ టెక్నాలజీ, కామేశ్వర, కాటేశ్వరాలయ నిర్మాణాలను స్వయంగా చూశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సామూహికంగా ఫొటోలు దిగారు. కార్యక్రమంలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, పర్యాటకశాఖ అధికారి సూర్యకిరణ్, పురావస్తు, పర్యాటక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాల పరిధిలో యువజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి చింతల అన్వేశ్ బుధవారం తెలిపారు. యువజన సంఘాల్లోని సభ్యుల వయసు 18 నుంచి 29లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న యువజన సంఘాలు నమోదు కోసం సభ్యుల ఆధార్‌కార్డు, సంఘం ప్రతులను హనుమకొండలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఈ నెల 19లోపు సమర్పించాలన్నారు. సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని సమన్వయ అధికారి తెలిపారు. మరిన్ని వివరాలకు 0870 2958776 సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244

పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- కనీస మద్దతు ధర రూ.500 పెంపు
- మార్కెటింగ్ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్

పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు అన్నదాతలు తెల్లబంగారంతో రావడం ప్రారంభమైంది. దీపావళి నాటికి విక్రయాలు జోరందుకుంటాయి. ఈ క్రమంలో మార్కెటింగ్ శాఖ పత్తి కొనుగోళ్లకు చేస్తున్న ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఎన్ని కొనుగోలు కేంద్రాలను నోటిఫై చేసింది? విపణికి సరకు ఏ మేరకు వస్తోంది? తదితర వివరాలతో వరంగల్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్‌తో సోమవారం 'ఈనాడు' ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలు.

ఈనాడు, వరంగల్, ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



ముఖాముఖి

? పత్తి రైతులు సరకుతో మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. ఈసారి కనీస మద్దతు ధర ఏ మేరకు పెరగనుంది?

✔ దసరా పండగ ముగియడంతో రైతులు పెద్ద మొత్తంలో పత్తి పంటతో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు వస్తున్నారు. ఈసారి వారికి ధర లాభసాటిగా ఉంటుందని భావిస్తున్నాం. కనీస మద్దతు ధర రూ.500 పెరిగింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) క్వింటాకు మద్దతు ధర రూ.7521 చెల్లించనుంది.

? సీసీఐకు విక్రయిస్తే రైతుల ఖాతాల్లో ఎన్ని రోజుల్లో డబ్బులు జమ వుతాయి?

✔ రైతులు ఆధార్ అథెంటిఫికేన్ చేసుకుని ఉంటే కొనుగోలు కేంద్రాల వద్ద పని సులువు అవుతుంది. ఆధార్‌తో లింక్ అవడం వల్ల పత్తి విక్రయించిన రెండు మూడు పని దినాల్లో డబ్బులు ఖాతాల్లో జమవుతాయి.

? పత్తి రైతులకు మార్కెటింగ్ శాఖ అన్ని సౌకర్యాలు కల్పిస్తోందా?

✔ రైతులకు సాంకేతికతను చేరువ చేసేందుకు ఒక వాట్సప్ నెంబర్ (8897281111) కూడా మా శాఖ కొత్తగా ప్రవేశపెట్టింది. అందులోకి రైతులు వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే కావాల్సిన సమాచారం వస్తుంది. ఏ యే జిన్నింగ్ మిల్లులో ఎంత మంది విక్రయాల కోసం వేచిచూస్తున్నారనే వివరాలు తెలుసుకోవచ్చు. ఎనుమాముల మార్కెట్‌లో ఇప్పటికే తాగునీటి వసతి కల్పించాం. విద్యుత్తు సరఫరా, యార్డులను శుభ్రం చేసి పెడుతున్నాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలపై కూడా మా సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. రైతులు పెద్ద ఎత్తున రావడానికి ముందే అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. మా శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సమీక్ష సైతం పూర్తయ్యింది.

? సరకు రాక అంచనా గతేడాదికన్నా పెరిగిందా.. తగ్గిందా?

✔ ఇప్పటికే మేం సరకు రాకపై ఒక అంచనా రూపొందించుకున్నాం. గతేడాది 28.72 లక్షలు మెట్రిక్ టన్నులు వచ్చింది. ఈ ఏడాది సరకు రాక మరింత పెరుగుతుందని వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా స్పష్టమైంది. సుమారు 32.09 లక్షలు మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశాం. ప్రస్తుతానికి ఎనుమాములకు కొద్ది మొత్తంలో మాత్రమే సరకు వస్తోంది. దీన్ని ప్రైవేటు వ్యాపారులు కొంటున్నారు. వరంగల్, సూర్యాపేట, నల్గొండ, ఆదిలాబాద్, ఖమ్మం, భువనగిరి తదితర జిల్లాల నుంచి అక్టోబరులో సరకు రావడం మొదలవుతుంది. నవంబరులో మిగతా జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో వస్తుంది.

? మద్దతు ధర పెరిగిన నేపథ్యంలో రైతులు ప్రైవేటు వ్యాపారుల కన్నా సీసీఐకే ఎక్కువ పత్తిని విక్రయించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎన్ని కేంద్రాలను నోటిఫై చేశారు?

✔ ఉమ్మడి జిల్లాలో 58 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ప్రస్తుతం 28 నోటిఫై చేశాం. త్వరలో వంద శాతం మిల్లులను అందుబాటులోకి తెస్తాం. రైతులు నేరుగా ఆ కేంద్రాలకు తీసుకొచ్చి పత్తిని విక్రయించవచ్చు. కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర వస్తే రైతులు బయట విక్రయించుకోవచ్చు. అప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయి.

? పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చే క్రమంలో రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి? తేమ శాతం ఎంత వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది?

✔ వచ్చేది చలికాలం కాబట్టి ఉదయం వేళ పత్తిపై తేమ ఎక్కువగా ఉంటుంది. అందుకే తొక్కడానికి సమయం తీసుకోవాలి. లేదంటే తేమ లోపల అలాగే ఉంటుంది.. రైతులు కోసిన వెంటనే తీసుకొస్తే మాయిశ్చర్ ఎక్కువగా నమోదవుతుంది. చాలా మంది రైతులు గ్రేడింగ్ చేయకుండా సరకును తీసుకురావడం వల్ల సీసీఐ వాళ్లు నిరాకరిస్తారు. గ్రేడింగ్ చేయడం మరవొద్దు. తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో వే బ్రిడ్జ్ మీదున్న బరువును అన్నదాతలు సరిచూసుకోవాలి.

ఎంజీఎంలో అరుదైన శస్త్రచికిత్స

- మహిళా గొంతుపై థైరాయిడ్ గడ్డ తొలగింపు



బాధితురాలితో వైద్య బృందం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో జనరల్ సర్జరీ విభాగం వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి. . ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలానికి చెందిన జన్ను వరలక్ష్మి(46) గొంతుపై 25 సె.మీ. వెడల్పుతో మెడ చుట్టూ ఆక్రమించి ఉన్న థైరాయిడ్ గడ్డతో పదేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. మెదడుకు రక్తప్రసారం చేసే నరాలను గడ్డ చుట్టుముట్టడంతో ఆహారం మింగలేకపోతున్నారు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా. . హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా.. ఫలితం కనిపించలేదు. చివరికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. కానీ ప్రాణాలకు హామీ ఇవ్వలేమని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితుల్లో 10రోజుల క్రితం ఎంజీఎం ఆసుపత్రి జనరల్ సర్జరీ వైద్య విభాగానికి వచ్చారు. ప్రొఫెసర్ డా.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వైద్య బృందం పరీక్షించింది. అన్నిరకాల పరీక్షల అనంతరం బుధవారం సుమారు 5 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారు. బాధితురాలి గొంతుపై 25సె.మీ. వెడల్పులో ఉన్న థైరాయిడ్ గడ్డను విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు డా.వినోద్‌కుమార్ దుస్సా, సీనియర్ రెసిడెంట్లు, పీజీ వైద్యులున్నారు. శస్త్రచికిత్స అనంతరం బాధితురాలు ఆరోగ్యంగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. కాగా ఇంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను ఎంజీఎం ఆసుపత్రిలో ఉచితంగా చేశారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులను ఎంజీఎం సూపరింటెండెంట్ డా.చిలుక మురళి అభినందించారు.

ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు?



వంతెన మీదుగా తిరుగుతున్న ప్రైవేటు వాహనాలు

హనుమకొండ నగరంలో ప్రధానమైన నయింనగర్ నాలాపై వంతెన నిర్మాణం పూర్తైనా ఆర్టీసీ బస్సులు ఈ మార్గంలో తిరగడం లేదు. ఏటా వర్షాకాలం నాలా పొంగి కాలనీలను ముంచెత్తుతుండటంతో ప్రభుత్వం రూ.7.40 కోట్ల నిధులతో ఈ ఏడాది ఏప్రిల్ 5 నాలా విస్తరణ, వంతెన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలకు సాగించే ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి నడిపారు. దీనికి అదనంగా టికెట్టుపై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. పనులు పూర్తై, ఆటోలు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు తిరుగుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సులను ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ మీదుగానే తిప్పుతున్నారు. దీని కారణంగా ప్రయాణికులపై ఆర్థికంగా అదనపు భారం పడటమేకాకుండా.. కరీంనగర్, సిద్దిపేట, వేములవాడ, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి సమయం కూడా వృథా అవుతోంది. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

అవిభక్త కవలలకు 22 ఏళ్లు

- సొంతగ్రామంలో పుట్టినరోజు వేడుకలు



కేక్ తినిపిస్తున్న వీణ-వాణి తల్లిదండ్రులు మురళి-నాగలక్ష్మి

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన అవిభక్త కవలలు వీణ, వాణి ఇరవై ఏళ్ల అనంతరం తమ సొంతింట్లో పుట్టిన రోజు వేడుకలను జరుపుకొన్నారు. మారగాని మురళి-నాగలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వీరు జన్మించారు. 13 ఏళ్ల పాటు నీలోఫర్ ఆసుపత్రిలోనే ఉన్నారు. అనంతరం స్టేట్‌హోంకు తరలించారు. అప్పటి నుంచి అక్కడే పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. స్టేట్‌హోం సూపరింటెండెంట్లు సఫియాఖాన్, సోమలక్ష్మితో కలిసి హైదరాబాద్ నుంచి బీరిశెట్టిగూడెం చేరుకోగా ఈసారి తమ ఇంట్లో బుధవారం 22వ జన్మదినాన్ని జరుపుకొన్నారు. బంధువులు, గ్రామస్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని, పిల్లలతో కలిసి ప్రతి జన్మదినాన్ని జరుపుకొనేలా అవకాశమివ్వాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పలువురు వీరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మేడారం జాతరలో శాశ్వత ఏర్పాట్లకు కృషి



వనదేవతలకు కుటుంబసమేతంగా పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

మేడారం(తాడ్వాయి), న్యూస్‌టుడే: మా కులదైవమైన సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి కుటుంబసమేతంగా బుధవారం మేడారం వచ్చి తన మనవడి పుట్టువెంట్రుకలు సమర్పించారు. అమ్మవార్లకు ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత మహా జాతర సందర్భంగా కోరిన కోర్కెలు తీరినందుకు మేడారం వచ్చి మొక్కులు చెల్లించామన్నారు. మేడారాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఎక్కువ అభివృద్ధి చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో తమ ప్రభుత్వం ఉన్నట్లయితే జాతీయ హోదా దక్కి, మరింత అభివృద్ధి చెందేదని తెలిపారు. రాబోయే జాతరనాటికి భక్తులకు అన్ని రకాల శాశ్వత ఏర్పాట్లు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధించి ప్రజలకు మేలు జరగాలని దేవతలను వేడుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్, దేవాదాయశాఖ డీసీ శ్రీకాంత్‌రావు, తహసీల్దారు రవీందర్, ఎంపీవో శ్రీధర్‌రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

బమ్మెర పర్యాటకాభివృద్ధి పనులపై నీలినీడలు

పాలకుర్తి, న్యూస్‌టుడే

జనగామ జిల్లాలోని బమ్మెర, వల్మిడి, సోమేశ్వరాలయం, పాలకుర్తికి తరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఎందరో మహానుభావులు, కవులు, కళాకారులు, పోరాటయోధులు పురుడుపోసుకున్నారు. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం 2017లో సుమారు రూ.23 కోట్లు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. వల్మిడి, పాలకుర్తిలో 90 శాతం మేర నిర్మాణాలు పూర్తి కాగా, బమ్మెరలో మాత్రం ఏళ్లుగా ఆగుతూ. . సాగుతూ.. వస్తున్నాయి.

40 శాతం మేర నిర్మాణ దశలోనే..



పురోగతి కనిపించని స్మారక కేంద్రం

బమ్మెరలో సహజ కవి పోతన చారిత్రక ఆనవాళ్లు ఉన్న ప్రదేశంలోనే సుమారు 4 ఎకరాల స్థలంలో పర్యాటకాభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో పోతన స్మృతివనంతోపాటు గ్రంథాలయం, అక్షరభ్యాస కేంద్రం, విడిది కేంద్రాలు, సమాధి, బావి పునరుద్ధరణ, ఆడిటోరియం తదితరాలు చేపట్టగా, అవి ఇంకా నిర్మాణ దశలోనే మగ్గుతున్నాయి. అలాగే రూ.3 కోట్లతో పోతన కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్నాళ్లుగా నిలిచిన పనులపై స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషాలు ఇతర శాఖల అధికారులతో పలుమార్లు సమీక్షించారు. చేసిన వాటికి బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇంకా 40 శాతం మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బమ్మెరను అభివృద్ధి చేస్తే పర్యాటకుల రాకతో ఆదాయం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే సోమేశ్వరాలయం ఆ ఖ్యాతిని దక్కించుకోగా, అక్కడి నుంచి వచ్చే భక్తులు బమ్మెర, వల్మిడి ప్రాంతాలను సైతం సందర్శిస్తున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి సరైన వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది.



అసంపూర్తిగా ఆడిటోరియం నిర్మాణం..

పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి..

- మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే

గత గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే పర్యాటకాభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పనుల పురోగతి, ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించి, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటాం. రానున్న రోజుల్లో పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి చేస్తా.

వైకుంఠధామం ప్రారంభం



మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ పురపాలక సంఘం పరిధిలోని అనంతారంలో మాజీ ఎమ్మెల్యే జెన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి వితరణగా ఇచ్చిన 1.30 ఎకరాల భూమిలో రూ. 18 లక్షల వ్యయంతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన వైకుంఠధామాన్ని బుధవారం ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.కోటిన్నర విలువైన భూమిని స్థానికుల కోసం దానంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. దాతలు భరత్‌చంద్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డిని అభినందించారు. భరత్‌చంద్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, పురపాలక వైస్‌ఛైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్లు కోడి నాగలక్ష్మి, పోతురాజు రాజు, విజయమ్మ, డీఈ ఉపేందర్ కాంగ్రెస్ నాయకులు కోడి శ్రీను, ఉపేందర్‌రెడ్డి, బండోజు ఉపేంద్రాచారి పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పరిశీలన

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని హనుమంతునిగూడెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, గోపాలపురంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం సబ్‌యూనిట్ అధికారి వి.శ్రీనివాస్ సందర్శించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించిన ఆయన సిబ్బందితో మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులను రోగులకు క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. సీహెచ్‌వో రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీ దీపిక, ఏఎన్ఎం ఉమారాణి, అరుణ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు కిట్లు పంపిణీ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం భద్రత కిట్లను ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సూపరింటెండెంట్ కిరణ్‌రాథోడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి నరసింహస్వామి, గీత కార్మిక సంఘం నాయకులు యమగాని వెంకన్న, జడ్పీటీసీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ప్రైవేట్ కళాశాలల బోధన రుసుము విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, టీజేఎస్ విద్యార్థి సంఘాలు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బుధవారం ఆర్డీఓ అలివేలుకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు పృథ్వీ, వెంకటేష్, సూర్యప్రకాష్, రాజేష్, సాయికుమార్, యాకయ్య, శ్రవణ్, ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులున్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ఉపకారవేతనాలు, ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ కాకతీయ ప్రైవేటు కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీపీసీఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఓ కళాశాలలో టీపీసీఎల్ఏ జిల్లా కమిటీ ముఖ్య నేతల సమావేశాన్ని సంఘబాధ్యుడు బానోతు మంగీలాల్ అధ్యక్షతన నిర్వహించారు. గత ప్రభుత్వం మూడేళ్లుగా ఉపకారవేతనాలు, ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురై నిర్వాహణ సమస్యగా మారిందన్నారు. దీంతో యాజమాన్యాలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ఉపకారవేతనాలను, ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరారు. టీపీసీఎల్ఏ రాష్ట్ర కార్యదర్శి నీలం వెంకటేశ్వర్లు, పట్టణకార్యదర్శి మారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కమిటీ బాధ్యులు కిషన్, శివ, రాజిరెడ్డి, వీరన్న, ప్రసాద్, సుధారాణి, పావని, రజిత, రమ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ఆదర్శనగర్‌కాలనీ ప్రధానవీధిలో రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని కాలనీవాసులు కోరుకుంటున్నారు. **అక్బర్**

సమాధానం: మున్సిపల్ సిబ్బందిని పంపించి తగిన చర్యలు తీసుకుంటాం. **- తోట రాజేష్, మున్సిపల్ శానిటరీఇన్‌స్పెక్టర్.**

డోర్నకల్: సీరోలు మండలం అందనాలపాడులో రెండు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ అంధకారంతో ఇబ్బంది పడుతున్నాం. **- కనిశెట్టి హరినాథ్‌రావు**

సమాధానం: సమస్య పరిష్కరిస్తాం **- శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, అందనాలపాడు**

డోర్నకల్: డోర్నకల్‌లోని శాంతినగర్‌లో రోడ్డు పక్కన చెత్త చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. **-ఆనంద్**

సమాధానం: శుభ్రం చేయిస్తాం.- అహ్మద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, డోర్నకల్

వ్యర్థాల తొలగింపు..

మహబూబాబాద్ టౌన్: కాకతీయనగర్‌కాలనీ నుంచి సిగ్నల్‌కాలనీ వరకు మురుగునీటి కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించాలని మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు కౌన్సిలర్ స్వాతి స్పందించారు. సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

పొదల..

డోర్నకల్: డోర్నకల్‌లోని సుభాష్‌వీధిలో కాలువ పక్కన పేరుకుపోయిన పొదలను సిబ్బంది బుధవారం తొలగించారు.

చెత్త సేకరణ

మహబూబాబాద్ టౌన్: కాకతీయనగర్‌కాలనీకి వారం రోజులుగా చెత్త బండి రావడం బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి 26వ వార్డు కౌన్సిలర్ డౌలాగర్ స్వాతి స్పందించారు. మున్సిపల్ సిబ్బందిని, చెత్త బండిని పంపించి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

తొర్రూరు వార్తలు

అక్రమ రవాణాను అడ్డుకునేదెవరు?..



యథేచ్ఛగా పట్టణంలో మొరం తరలింపు

తొర్రూరు, న్యూస్‌టుడే: మండలంలో ఇసుక, మొరం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మడిపల్లి గ్రామ శివారు ఆకేరువాగు, జమస్థాన్‌పురం, గుర్తూరు శివారు వాగుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తూ, జేబులు నింపుకుంటున్నారు. ఆకేరువాగులో నీరు ప్రవహిస్తున్నా వదలకుండా బయట కుప్పలుగా పోసి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. వాహనాలకు నంబర్‌ప్లేట్‌లు తొలగించి అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిని అడ్డుకుని సహజవనరులను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై ఉపేందర్ దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందిస్తూ.. ఫిర్యాదులు వస్తున్నాయని, నిఘా పెంచి రెవెన్యూ అధికారుల సహాయంతో కట్టడికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళలపై దాడుల నియంత్రణలో విఫలం

తొర్రూరు, న్యూస్‌టుడే: మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, హక్కుల కోసం ఉద్యమించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి జి.ప్రమీల పిలుపునిచ్చారు. డివిజన్ కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సంఘం రెండో మండల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హక్కుల రక్షణకు ఈ నెల 21 నుంచి 23 వరకు కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సంఘం మండలాధ్యక్షురాలిగా మణెమ్మ, ఉపాధ్యక్షురాలిగా సరోజన, సహాయ కార్యదర్శిగా ఎల్లమ్మ, కోశాధికారిగా శైలజతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు యాకమ్మ, రమాదేవి, స్వరూప, సునిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రమీల

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

పెద్దవంగర, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. నూతనంగా ఎంపికైన ఆరుగురు ఉపాధ్యాయులకు బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. నూతనంగా ఉద్యోగాల్లో చేరుతున్న వారంతా ఆయా పాఠశాలలు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కవిరాజ్, సీఆర్పీలు నిరంజన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీల ఎంపిక పారదర్శకత అవసరం

తొర్రూరు, పెద్దవంగర, న్యూస్‌టుడే: నిబంధనల ప్రకారం గ్రామసభలు నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఏర్పాటు చేయాలని తొర్రూరు, పెద్దవంగర భారాస మండలాధ్యక్షులు పి.సీతారాములు, ఈదురు ఐలయ్యలు డిమాండ్ చేశారు. కమిటీల ఎంపిక పారదర్శకంగా చేయాలని కోరుతూ బుధవారం ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు. కమిటీల్లో అధికార పార్టీల నాయకులే ఉండి, తమకు అనుగుణంగా ఉన్నవారిని ఎంపిక చేసుకుంటారని ఆరోపించారు. ఏకపక్ష నిర్ణయాలను ఆపకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన్న అంజయ్య, ప్రమోద్, వీరభద్రరావు, సుధీర్, సమ్మయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరులో..

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమం: కేసముద్రం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, ప్రధాన కార్యదర్శి సూర్యం అన్నారు. ఈ నెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ బుధవారం గోడపత్రికలను ఆవిష్కరించారు.

అక్షరాలు దిద్దిన బడిలో.. ఉపాధ్యాయురాలు!

ఓనమాలు దిద్దిన పాఠశాలలోనే ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు కురవి మండలం మోద్గులగూడెం గ్రామానికి చెందిన తుపాకుల కావ్య. 2004 స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఓనమాలు నేర్చుకున్న తుపాకుల కావ్య 2008 వరకు ఐదో తరగతి పూర్తి చేశారు. అదే మైదానంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో 2013లో పదోతరగతిలో 9.0 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. 2015--17లో టీటీసీ పూర్తి చేశారు. డీఎస్సీ 2024లో జిల్లాలో 31వ ర్యాంకు సాధించారు. చదువుకున్న పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా బోధించే అవకాశం దక్కడం గర్వంగా ఉందన్నారు. – న్యూస్‌టుడే, కురవి, (మరిపెడ)



కావ్య

అన్నిదానాల్లో అన్నదానం మిన్న

తొర్రూరు, న్యూస్‌టుడే: అన్నిదానాల్లో కెల్ల అన్నదానం మిన్న అని డివిజన కేంద్రంలోని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ తెలిపారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పలువురికి అన్నదానం చేశారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, వృథా చేయరాదని వివరించారు. క్లబ్ ప్రతినిధులు వేణుగోపాల్, కోటయ్య, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామమంచినీటి సహాయకులకు శిక్షణ

తొర్రూరు, న్యూస్‌టుడే: తొర్రూరు, పెద్దవంగర మండలాలకు చెందిన పలువురు గ్రామమంచినీటి సహాయకులకు శిక్షణ అందిస్తున్నట్లు మిషన్ భగీరథ ఏఈ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మిషన్ భగీరథ అతిథి గృహంలో బుధవారం సహాయకులకు నీటి సరఫరాపై అవగాహన సమావేశం నిర్వహించి, కుళాయిల మరమ్మతు, చేతి పంపుల నిర్వహణ, మోటార్‌లు, స్టాటర్‌లపై అవగాహన కల్పించారు. సమావేశంలో సిబ్బంది యాకూబ్‌పాష, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీ.. పట్టించుకునేవారేరి?

జోగ్యాతండాలో మిషన్ భగీరథ పైపులైన్ బుధవారం పగిలి నీరు వృథాగా పోయింది. జేసీబీతో కాలువ గండి పూడ్చేందుకు ప్రయత్నిస్తుండగా పైపులైన్ పగిలింది. దీంతో రైతులు ఆందోళన చెందారు.

– న్యూస్‌టుడే, డోర్నకల్



అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం గుడ్ల పంపిణీ

నర్సింహులపేట (మరిపెడ), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుంది. గుత్తేదారులు నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నర్సింహులపేట మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు వచ్చాయని చిన్నారుల తల్లిదండ్రులు ఆరోపించారు. బూజుపట్టి, గుడ్డుపై నల్ల మచ్చలు, దుర్వాసన వస్తున్నట్లు తెలిపారు. ఈ నాసిరకం కోడిగుడ్లు తింటే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అనారోగ్యానికి గురవుతారని వాపోయారు. ప్రతి కేంద్రంలో 6 నెలల చిన్నారుల నుంచి 3 ఏళ్లు దాటిన వారికి నెలకు 16 గుడ్లు, గర్భిణులు, బాలింతలకు రోజుకు ఒక గుడ్డుతో పాటు ప్రతి గురువారం రెండు గుడ్లు పంపిణీ చేయాలి. మరిపెడ ప్రాజెక్టు పరిధిలోని 4 మండలాల్లో 297 కేంద్రాలు ఉన్నాయి. 7069 మంది చిన్నారులు, 706 మంది గర్భిణులు, 677 మంది బాలింతలు ఉన్నారు. వీరికి అక్టోబరులో 50 వేల కోడిగుడ్లు అవసరం ఉన్నాయి. ఇప్పటికైనా నాణ్యమైన కోడిగుడ్లను అందజేయాలని కోరుతున్నారు. ఈ విషయమై మరిపెడ సీడీపీవో ఎల్లమ్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అధికారులకు సమాచారం అందించామని, నాణ్యమైన గుడ్లను అందజేయాలని గుత్తేదారులను ఆదేశించినట్లు తెలిపారు.



పెద్దనాగారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందజేసిన నల్ల మచ్చల గుడ్డు

సంక్షిప్తంగా

ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ



గార్ల, న్యూస్‌టుడే: మర్రిగూడెం సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠను ఎమ్మెల్యే కోరం కనకయ్య, దాతలు ప్రవాస భారతీయులు డాక్టర్ పులి గోపాలరెడ్డి, ప్రవీల దంపతుల సమక్షంలో నిర్వహించారు. పునఃప్రతిష్ఠకు ఈ నెల 13 నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలో పూర్ణాహుతిని జరిపించారు. ఈవో సమత, పీఏసీఎస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ధార్మికకమిటీ సభ్యులు, తదితరులున్నారు.

విధుల్లో చేరిన వార్డెన్

దంతాలపల్లి: దంతాలపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం వార్డెన్‌గా మడప నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అందించే సన్న బియ్యం లెక్కల్లో తేడాలు తలెత్తిన నేపథ్యంలో జిల్లా అధికారులు మరిపెడలోని ఎస్సీ వసతి గృహం వార్డెన్‌గా బాధ్యతలు నిర్వర్తించే నాగరాజుకు బాధ్యతలు అప్పగించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్డెన్ ఠాకూర్ స్థానంలో డీడీ ఆదేశాల మేరకు తాను వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు నాగరాజు చెప్పారు.

ఏజెన్సీ చట్టాలకు లోబడి ఇళ్లు ఇవ్వాలి

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఏజెన్సీ చట్టాలకు లోబడి మంజూరు చేయాలని కోరుతూ బుధవారం కొత్తగూడ ఎంపీడీవో రవీంద్రప్రసాద్‌కు తుడుందెబ్బ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు పూనెం సందీప్ కుమార్, నర్సింగరావు, భాస్కర్, వెంకన్న, ఉపేందర్, తదితరులు వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కురవి, న్యూస్‌టుడే: ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆర్ఐ రవికుమార్ గురువారం తెలిపారు. నేరడ మీదుగా కురవికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మాధవాపురం శివారు ఇస్లావత్‌తండా సమీపంలో పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు.

రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని వినతి

కేసముద్రం: తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్లో సింగరేణి, పుష్‌పుల్, దిగువ మార్గంలో ప్యాసింజరు రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరుతూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ మండల నాయకులు గొడిశాల వెంకన్న, మాద శ్రీనివాస్, రాజశేఖర్, భిక్షపతి, ఉపేందర్, వెంకన్న తదితరులున్నారు.

కేసు నమోదు చేయాలని ఫిర్యాదు

నెహ్రూసెంటర్: మున్నూరుకాపుల మనోభావాలు దెబ్బతినేలా వాఖ్యలు చేసిన ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులపై సుమోటో కేసు నమోదు చేయాలని మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి మద్దెల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం మహబూబాబాద్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఛానల్ నిర్వాహకులపై ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అందులో మున్నూరు కాపులను దూషిస్తూ అప్‌లోడ్ చేసిన వీడియోలో మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మున్నూరు కాపు సంఘం యువజన అధ్యక్షులు పిట్టల శ్రీకాంత్, సంఘం బాధ్యులు సుధాకర్, రావిశెట్టి చంద్రశేఖర్, మార్నేని కిరణ్, శ్రీనివాస్, వెంకన్న, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

చిన్నగూడూరు: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సమర్థ విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై జెండర్ స్పెషలిస్ట్ అరుణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో హెల్ప్‌లైన్ నెం. 1098, 181, 100, 1930 లను సంప్రదించాలని తెలిపారు. సౌజన్య, సంధ్యారాణి, ఉపాధ్యాయులు అనిత, శృతి ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై ఫిర్యాదు చేస్తాం



మహబూబాబాద్: మహబూబాబాద్ పురపాలక సంఘంలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో పారదర్శకత లోపించిందని ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న, భారాస ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్ వార్డు కౌన్సిలర్లతో కలిసి బుధవారం కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. కమిటీల ఏర్పాటు విధి విధానాలను స్పష్టం చేయాలని ఆ మేరకే నియమించాలని కమిషనర్‌ను కోరారు. వార్డు కౌన్సిలర్లు మార్నేని శ్రీదేవి, భారాస నాయకులున్నారు.

కార్మికుల నైపుణ్యాభివృద్ధికి చేయూత

డోర్నకల్: కార్మికుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపునకు ప్రభుత్వం చేయూత అందిస్తోందని ఎంపీవో మున్వర్‌బేగ్ పేర్కొన్నారు. మండలంలోని అమ్మపాలెంలో నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ప్రజాప్రతినిధుల సమక్షంలోనే ఇందిరమ్మ కమిటీలు

మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీలు స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించాలని మహబూబాబాద్ పురపాలక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, 27వ వార్డు కౌన్సిలర్ ఎండీ.ఫరీద్ బుధవారం పురపాలక కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రం అందించారు. వార్డు కమిటీల్లో కౌన్సిలర్ ఛైర్మన్‌గా అన్ని వర్గాలతో కమిటీలు వేసి ప్రభుత్వానికి పంపించాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించాలి

గంగారం: ఏజెన్సీ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటులో పెసా చట్టం నిబంధనలు పాటించాలని గంగారం మండల తుడుం దెబ్బ అధ్యక్షుడు సువర్ణపాక వెంకటరత్నం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో మాట్లాడారు. గంగారం ఎంపీడీవో అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చుంచ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

గోడపత్రికల ఆవిష్కరణ



ఇనుగుర్తి: హైదరాబాద్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించే ఐఎఫ్‌టీయూ విలీనసభను విజయవంతం చేయాలని కోరుతూ భారత కార్మిక సంఘాల సమైక్య జిల్లా నాయకులు కందాల రంగయ్య బుధవారం మండలకేంద్రంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని అన్నారు. యూనియన్ జిల్లా నాయకులు రాములు, యాకలక్ష్మి, పప్పుల ఉమ, ప్రసాద్, శ్రీను, పార్వతమ్మ తదితరులున్నారు.

తాగునీటి సరఫరాకు కృషి

నర్సింహులపేట: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా కృషి చేయాలని మిషన్ భగీరథ ఏఈ రాకేష్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మండలానికి చెందిన గ్రామ మంచినీటి సహాయకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాధవి, ఎంపీవో కిన్నెర యాకయ్య, అబ్బాస్ పాల్గొన్నారు.

రుణ మాఫీ చేయాలని వినతి

బయ్యారం: పట్టాదారు పాసుపుస్తకాలు లేని రైతుల రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును క్యాంప్ కార్యాలయంలో కలిసి బయ్యారం ప్యాక్స్ అధ్యక్షుడు మూల మధుకర్‌రెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం కొనివ్వలేదని.. యువకుడి ఆత్మహత్య

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం కొనివ్వడంలేదని మనోవేదనతో గడ్డి నివారణ మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇనుగుర్తిలో బుధవారం చోటుచేసుకుంది. కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాడబోయిన కుమార్ (24) ఇంటర్మీడియట్ మధ్యలో మానేసి ఖాళీ గా తల్లితండ్రుల వద్ద ఉంటున్నాడు. కొద్ది రోజుల నుంచి ద్విచక్ర వాహనం కొనివ్వమని తండ్రి శ్రీనును కోరుతున్నారు. కొనివ్వకపోవడంతో మనస్తాపం చెందిన కుమార్ సోమవారం గ్రామంలో గడ్డి నివారణ మందు కొనుగోలు చేసి గుంటి చెరువు సమీపంలోని శ్మశానవాటిక వద్ద గడ్డి మందు తాగాడు. విషయాన్ని తన సోదరుడు సందీప్‌కు చరవాణి ద్వారా తెలియజేశాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



కాడబోయిన కుమార్ (పాత చిత్రం)

ఏటీఎం చోరీ ఘటనలో మరొకరు కోర్టుకు..

బయ్యారం, న్యూస్‌టుడే: బయ్యారం బస్టాండ్ కూడలిలోని ఎస్బీఐ ఏటీఎం చోరీ కేసులో మరో వ్యక్తిని రాజస్థాన్ పోలీసులు బుధవారం మహబూబాబాద్ అదనపు జూనియర్ సివిల్ కోర్టుకు హాజరుపర్చారు. రాజస్థాన్‌కు చెందిన అస్మద్దీన్ బయ్యారం ఏటీఎం చోరీ కేసులో ఏ2గా ఉన్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన పోలీసులు అతన్ని కోర్టులో హాజరుపర్చారు. బయ్యారం ఏటీఎం కేసులో ఏ1 నిందితుడు అబ్దుల్‌గనీ ని ఈనెల 2న బయ్యారం పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచారు. అదే సమయంలో ఏ2గా ఉన్న అస్మద్దీన్ రాజస్థాన్‌లో పలు కేసుల్లో నిందితుడుగా అక్కడే జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. అదే రోజు వీడియోకాల్ ద్వారా (వర్చువల్)గా ఏ2గా ఉన్న అస్మద్దీన్‌ను కోర్టులో హాజరుపర్చారు. రాజస్థాన్‌లో జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన అస్మద్దీన్‌ను అక్కడి పోలీసులు మహబూబాబాద్ కోర్టులో హాజరుపర్చారు. దీనిపై విచారించిన కోర్టు అస్మద్దీన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు కోర్టు డ్యూటీ అధికారి తెలిపారు.

తేనెటీగల దాడిలో గాయాలు

కేసముద్రం: తేనెటీగల దాడిలో ఒకరు గాయపడిన సంఘటన బుధవారం కేసముద్రం(వి) గ్రామంలోని చైతన్య నగర్‌లో జరిగింది. వల్లందాసు ఎల్లయ్య వ్యవసాయ భూమి వద్దకు వెళ్తుండగా మార్గం మధ్యలో తేనెటీగలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. మహబుబాబాద్ ఆసుపత్రి నుంచి వరంగల్ తరలించారు.

ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులను బుధవారం మాతా, శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో స్కానింగ్ రికార్డులను పరిశీలించారు. రోగుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ప్రోగ్రాం అధికారుల డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి ఆసుపత్రి నిర్వాహకులకు సూచించారు. అనుమతి లేకుండా గర్భిణులకు స్కానింగ్‌లు తీయొద్దని ఆదేశించారు. మాతా, శిశువుల మరణాలు జరిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. లింగనిర్ధారణ చేసి గర్భస్రావాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కేవీ.రాజు పాల్గొన్నారు.



ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలి

గార్ల, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సత్రు డిమాండు చేశారు. ఉచిత బస్సులు మినహా మిగతా సంక్షేమ పథకాలు అమలుకు నోచుకోని పరిస్థితి ఉందన్నారు. అర్హత కలిగినవారు సాంకేతిక సమస్యలతో లబ్ధి పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం ఉప తహసీల్దార్ సుధాకర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు.



ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు